ప్రజాశక్తి
మంగళవారం 26 డిసెంబర్ 2023 5
శ్రీ సత్యసాయి

ఓబులదేవరచెరువలో నిర్వహించిన అంగన్వాడీల సమ్మెలో మాట్లాడుతున్న సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు

అంగన్వాడీల ఆందోళన పట్టదా..?

పిల్లలకు అన్నం లేదు.. ఆటా పాట లేదు...
పట్టించుకోని పాలకులు
ప్రభుత్వ వైఖరితో ప్రజల్లో అసహనం

తల్లుల కోసం రోడ్డుపై బైటాయించిన చిన్నారులు (ఫైల్ ఫోటో)

పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలు అభివృద్ధి చేస్తున్నామని, ఉద్యోగులను అన్ని విధాల ప్రోత్సహిస్తున్నామని చెబుతున్న ప్రభుత్వం వారి సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం చూపుతోంది. ఫలితంగా అంగన్వాడీ కార్యకర్తలు సమ్మె బాటపట్టారు. ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా కేంద్రాల్లోని చిన్నారులు భోజనానికి, ఆటపాటలకు దూరమవుతున్నారు. గర్భిణులు, బాలింతలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తమ సమస్యలు పరిష్కారించాలని డిమాండ్ చేస్తు గత 14 రోజులుగా చంటి బిడ్డలను తీసుకుని రోడ్డుపై వచ్చి అంగన్వాడీలు ఆందోళన చేస్తున్నా ప్రభుత్వం మాత్రం వీరిపై కాస్తా జాలి కూడా చూపడం లేదు.

ప్రజాశక్తి-హిందూపురం

తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 14 రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు చేస్తున్న సమ్మె ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు కొనసాగుతూనే ఉంది. ప్రభుత్వం పట్టించుకోకపోవటంతో ఆందోళన కార్యక్రమాలు హోరెత్తాయి. ప్రభుత్వ వైఖరితో ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా దాదాపు 2.25 మంది ఆరేళ్లలోపు చిన్నారులు, 16 వేల మంది గర్భిణులు, 18 వేల మంది వరకు బాలింతలు ఇబ్బందులు పడుతున్నారు. అంగన్వాడీ కేంద్రాలు తెరిపించి వాటిని నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించింది. దీంతో సొంత భవనాలకు వేసిన తాళాలను కొన్నిచోట్ల పగలగొట్టించి, అద్దె భవనాలతో సహా మరికొన్ని చోట్ల నోటీసులు అంటించింది. ప్రభుత్వ వైఖరి ప్రజల్లో కూడా అసహనాన్ని తెప్పించింది. మూడు నెలల లోపు చిన్నారులకు రోజు ఒక గుడ్డు, పాలు అందించేవారు. ప్రస్తుతం పిల్లలకు పోషక ఆహారం అందడం లేదు. ఆటాపాట లేదు.

సచివాలయ సిబ్బందితో నిర్వహణకు యత్నం

గర్భిణీలు, బాలింతలు, మూడు నుంచి 6 ఏళ్ల పిల్లలకు పంపిణీ చేయాల్సిన బాలామృతం కిట్లు సచివాలయాల సిబ్బందితో పంపిణీ చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రస్తుతం స్వాధీనం చేసుకున్న అంగన్వాడీ కేంద్రాలను తెరిపిస్తున్నా అక్కడ కార్యకర్తలు, ఆయాలు కనిపించకపోవడంతో పిల్లలు రావడం లేదు. కేంద్రాలు తెరిచిన బువ్వ అందలేనప్పుడు ఏం ప్రయోజనం అని చిన్నారుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. సచివాలయాల్లో విధులతో పాటు అదనంగా ఈ బాధ్యతలను అప్పగించడంపై కొందరు సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. ఉన్నతాధికారులు ఆదేశించడంతో తప్పనిసరి పరిస్థితుల్లో వీటిని తెరుస్తున్నామని పేరు చెప్పేందుకు అంగీకరించని మహిళా పోలీసులు, సచివాలయ సెక్రేటరీలు వాపోతున్నారు. ఈ కేంద్రాల్లో వంట వార్పు పర్యవేక్షణ అంటే కష్టం అంటున్నారు.

గడ్డితింటూ నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్వాడీలు (ఫైల్ఫోటో)

ఇచ్చిన హామీలు నెరవేర్చండి

అంగన్వాడీలు తమ డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన నిరవధిక సమ్మెలో భాగంగా సోమవారం 14వ రోజు సత్యసాయి జిల్లాలో తమ ఆందోళనలు కొనసాగించారు. సిఐటియు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఆందోళనలో భాగంగా వినూత్న నిరసన చేపట్టారు. క్రిస్మస్ నేపథ్యంలో సిఎం జగన్మోహన్‌రెడ్డికి మంచిబుద్ధి ప్రసాదించాలని కోరుతూ చర్చిల వద్ద, సమ్మె శిబిరాల వద్ద కేక్ కట్ చేశారు. జిల్లాలో ఓబుళదేవరచెరువు, చిలమత్తూరు, పుట్టపర్తి, గుడిబండ, ముదిగుబ్బ, హిందూపురం, మడకశిర తదితర ప్రాంతాల్లో తమ నిరసనను కొనసాగించారు. ఓబుళదేవరచెరువులో జరిగిన కార్యక్రమంలో సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, చిలమత్తూరులో జరిగిన కార్యక్రమంలో వ్యవసాయ కార్మికసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగరాణి తదితరులు పాల్గొన్నారు. ఆయా ప్రాంతాల్లో జరిగిన ఆందోళనల్లో అంగన్వాడీలు, సిఐటియు నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి 'ఆడుదాం ఆంధ్ర' పోటీలు

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

గ్రామీణ, పట్టణ స్థాయి క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'ఆడుదాం ఆంధ్ర' క్రీడా పోటీలు జిల్లాలో ఈ నెల 26వ తేదీ నుంచి మంగళవారం నుంచి ప్రారంభమవుతాయని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ ఉదయభాస్కర్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. క్రీడల నిర్వహణకు సంబంధించి అన్ని చర్యలు చేపట్టామన్నారు. కదిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఉదయం 11 గంటలకు క్రీడోత్సవాలు ప్రారంభమవుతాయని, బ్రాండ్ అంబాసిడర్లు బాస్కెట్ బాల్ ఇంటర్నేషనల్ క్రీడాకారుడు శ్రీకాంత్‌రెడ్డి, ఒలింపిక్ హాకీ క్రీడాకారిణి రజిని, జిల్లా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు హాజరవుతారన్నారు.

హిందూపురం : మంగళవారం నుంచి ప్రారంభం అవుతున్న ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను అందరం కలిసి విజయవంతం చేద్దాం అని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్ కుమార్ పిలుపునిచ్చారు. ఇందులో భాగంగా సోమవారం పట్టణంలోని ఎంజిఎం క్రీడా మైదానాన్ని ఆయన పరిశీలించారు. పోటీల నిర్వహణపై పాఠశాలల పీడీలకు పలు సూచనలు చేశారు. క్రీడలు ప్రారంభం అవుతున్న నేపథ్యంలో మైదాన ఆవరణం శుభ్రంగా ఉంచాలని శానిటరీ ఇన్స్‌పెక్టర్‌కు సూచించారు. దీంతో పాటు క్రీడల నిర్వహణ గురించి పీడీలతో చర్చించారు. వార్డు, గ్రామ స్థాయిలో ప్రతిభ గల క్రీడాకారులను వెలికితీయడానికి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు ఎంతగానో దోహదపడతాయన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పాఠశాలల పీడీలు పాల్గొన్నారు.

శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి నివాళి అర్పిస్తున్న మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి

శ్రీకృష్ణదేవరాయలు ఆదర్శప్రాయుడు : పల్లె

ప్రజాశక్తి-బుక్కపట్నం

నేటితరం రాజకీయ నాయకులు శ్రీకష్ణదేవరాయలును ఆదర్శంగా తీసుకుంటే గ్రామాలు అభివృద్ధి చెందుతాయని మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి పేర్కొన్నారు. పల్లె సోమవారం శ్రీకృష్ణదేవరాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ చరిత్ర గర్వించదగ్గ మహోన్నత వ్యక్తి రాయలు అన్నారు. ఆయన కీర్తి ప్రతిష్టలను పెంపొందించేలా ప్రతిఒక్కరూ కృషి చేయాలన్నారు. రాయలు వారసులైన బలిజలు ఐకమత్యంతో ముందుకు సాగాలన్నారు. అనంతరం బలిజ సంఘం ఆధ్వర్యంలో పల్లెను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జనసేనపార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి పత్తి చంద్రశేఖర్, సంఘం నాయకులు సంజీవరాయుడు, ఈశ్వరప్ప, గోపాల్, వెంకటరాముడు, బాలాజీ, సతీష్‌కుమార్, చంద్ర, శివయ్య, సంకు మహేష్, కరణం సురేష్ పాల్గొన్నారు

పారిశుధ్యం మెరుగుకు ప్రత్యేక చర్యలు : మున్సిపల్ కమిషనర్

ప్రజాశక్తి-హిందూపురం

మున్సిపాలిటీ పరిధిలో పారిశుధ్యం మెరుగు కోసం ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. పురపాలక సంఘంలో ఇంటింటా చెత్త సేకరణలో భాగంగా 4 డివిజన్లకు కేటాయించిన అదనపు ట్రాక్టర్లను సోమవారం కమిషనర్ ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ గత నెల నుంచి క్లాప్ ఆటోలు నిలిచిపోయాయని, దీంతో ఇంటింటా చెత్త సేకరణ పూర్తిస్థాయిలో జరగడం లేదన్నారు. ప్రజల ఫిర్యాదుల మేరకు డివిజన్‌కు ఓ ట్రాక్టర్‌ను ఏర్పాటు చేశామన్నారు. దీంతో పాటు నేటి నుంచి పారిశుధ్య కార్మికులు సమ్మెలోకి వెళ్లే అవకాశం ఉండడంతో ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజినీర్లు, అధికారులు పాల్గొన్నారు.

ఎపిని అప్పుల పాల్జేసిన సిఎం జగన్ : బికె

ప్రజాశక్తి-గోరంట్ల

సిఎం జగన్ రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని టిడిపి జిల్లా అధ్యక్షుడు బికె పార్థసారథి విమ ర్శించారు. బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో భాగంగా సోమవారం ఆయన స్థానిక పార్టీ నాయకులతో కలిసి పట్టణంలోని మూలబావి వీధిలో ఇంటింటికీ వెళ్లి టిడిపి రూపొందించిన సూపర్ సిక్స్, మినీ మేనిఫెస్టో కరపత్రాలను ప్రజలకు పంపిణీ చేశారు. స్థానిక బస్టాండ్ సర్కిల్‌లో బికె మాట్లాడుతూ రాష్ట్రాభివృద్ధి టిడిపితోనే సాధ్యమన్నారు. వైసిపి పాలన దౌర్జన్యాలు, అరాచకాలతో సాగిం ది తప్ప ఎక్కడా అభివృద్ధి జరగలేదన్నారు. పారిశ్రామికవేత్తలు రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి భయపడి ఇతర రాష్ట్రాలకు వెళ్లిపోయారన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ సోమశేఖర్, హిందూ పురం పార్లమెంట్ కార్యదర్శి నరసింహులు, మారేడుపల్లి నరసింహులు, వెంకటరమణ, జయరాం, శ్రీనివాసులు, వేణు, ఉమర్‌ఖాన్, అజ్మతుల్లా, దాసయ్య, వెంకట్‌రెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మడకశిర : చంద్రబాబుతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని టిడిపి మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ తెలిపారు. మండల పరిధిలోని ఆమిదాలగొంది పంచాయతీ హెచ్‌ఆర్.పాల్యం, గౌరీపురం గ్రామాల్లో బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఆయా గ్రామాల్లో తెలుగుతమ్ముళ్లు ఇంటింటికి వెళ్లి ప్రజలకు భవిష్యత్తుకు గ్యారెంటీ కార్డులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు లక్ష్మీనారాయణ, నాయకులు నాగరాజు, గిరి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గోరంట్లలో జరిగిన కార్యక్రమంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బికె పార్థసారథి

సమస్యలు ఏ 'కరువు' పెట్టేరా..?

ఈ ఏడాది తీవ్రమైన కరువు నెలకొంది. రైతులు తీవ్రంగా నష్టపోయారు. ఈ నేపథ్యంలో మంగళవారం జరుగుతున్న జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో జిల్లాలో నెలకొన్న కరువు పరిస్థితులపై నాయకులు చర్చిస్తారా లేక ఎప్పటిలాగానే తూతూమంత్రంగానే ముగిస్తారా అన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఉమ్మడి అనంతపురం జిల్లాకు సంబంధించి జెడ్పీ సర్వసభ్య సమావేశం మంగళవారం స్థానికజిల్లా పరిషత్ సమావేశం హాలులో జరుగనుంది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ బోయ గిరిజమ్మన అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి రెండు జిల్లాలకు సంబంధించిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు హాజరవ్వాల్సి ఉంటుంది. అయితే గత కొన్ని సమావేశాలుగా చూస్తే ఎమ్మెల్యేలు, ఎంపీల హాజరు నామ మాత్రంగానే ఉంటోంది. వచ్చినా మొక్కుబడిగానే సమస్యలపై ప్రస్తావన ఉంటోంది. జిల్లా పరిషత్‌లో ఇద్దరు జెడ్పీటీసీలు మినహా తక్కిన వారందరూ అధికారపార్టీ వారే ఉన్నారు. దీంతో సమస్యలు మొక్కుబడిగానే ప్రస్తావనకు వస్తున్నాయి.

నేడు జెడ్పీ సర్వసభ్య సమావేశం
సమస్యలు ప్రస్తావనకొచ్చేనా..లేక తూతూ మంత్రమేనా..?

జిల్లా పరిషత్ కార్యాలయంలోని సమావేశ భవనం

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

కరువుపై స్పందించేరా ..?

ఈ ఏడాది తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో ప్రభుత్వం ఇప్పటికే రెండు జిల్లాల పరిధిలో 49 మండలాలను కరువు మండలాలుగా ప్రకటించింది. ఈ మేరకు కేంద్ర కరువు బృందాలు కూడా పర్యటించి వెళ్లాయి. అయితే కరువు సహాయం ఏ మేరకు అందుతుందన్న దానిపై స్పష్టతలేదు. రాష్ట్ర ప్రభుత్వం కూడా సత్యసాయి జిల్లాలో పది మండలాలను కరువు మండలాలుగా ప్రకటింకపోవడం గమనార్హం. అదే విధంగా అనతపురం జిల్లాలో మూడు మండలాలు మినహాయింపు ఉంది. అయితే ఈ మండలాల్లోనూ కరువు పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఇన్‌పుట్ సబ్సిడీ ప్రతిపాదనలపైనా విపక్షాలు అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నాయి. నష్టాన్ని తక్కువ చేసి చూపే విధంగా ప్రభుత్వ తీరుందని విమర్శిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఆయా మండలాల్లోని పరిస్థితులను స్థానిక ప్రజాప్రతినిధులు ఏ రకంగా ముందుకు తీసుకొస్తారన్నది చూడాల్సుంది.

ఆయకట్టు రైతుల్లోనూ ఆందోళన

వర్షాభావానికి తోడు తగినంత నీరు హెచ్ఎల్‌సి నుంచి రాకపోవడంతో ఆయకట్టు రైతుల్లో గుబులు నెలకొంది. జనవరి ఆఖరు వరకు రావాల్సిన నీరు నవంబరు ఆఖరుకే ముగిసింది. దీంతో ఆయకట్టు కింద ఉండే పంటలు నష్టపోయే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో రైతులు ఆందోళన బాటపట్టారు. ప్రత్యామ్నాయం ఉందని విపక్షాలు చెబుతున్నాయి. హెచ్ఎన్ఎస్ఎస్, ఎల్ఎల్‌సిల నుంచి నీటిని తీసుకునే అవకాశముందని సూచిస్తున్నాయి. ఈ అంశాలూ ఈ సమావేశంలో చర్చకొస్తాయా లేదా అన్నది చూడాల్సుంది.

ఎన్నికలు సమీస్తున్న వేళ సమస్యలు ముందుకొచ్చేనా ..?

ఈ సమావేశం నుంచి తరవాతి సమావేశంలోపు ఎన్నికలు మరింత సమీపించే అవకాశాలున్నాయి. అంతలోపు అభివృద్ధి కార్యక్రమాలను ఏ విధంగా ముందుకు తీసుకెళ్లాలన్న అంశాలను అధికార ప్రజాప్రతినిధులు ప్రస్తావిస్తారా లేదా అన్నది చూడాల్సుంది. రోడ్డు పనులు, ఇతర అభివృద్ధి పనులు నత్తనడకన నడుస్తున్నాయి. వీటిని వేగవంతం చేయడానికి తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించే అవకాశాలున్నాయి. ఇదే సమయంలో అంగన్‌వాడీ, ఆశ, ఎస్ఎస్ఎ ఉద్యోగులు తమ డిమాండ్ల సాధన కోసం పోరాటం సాగిస్తున్నారు. దీనికి మద్దతునిస్తారా లేదా అన్నది కూడా చూడాల్సుంది.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

తమ గురువులతో పూర్వ విద్యార్థులు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ఎంజిఎం మున్సిపల్ హై స్కూల్‌లో 1977, 1978, 1979వ సంవత్సరంలో పదవ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం సోమవారం ఘనంగా జరిగింది. తొలత పాఠశాల ఆవరణంలో ఉన్నా గాంధీ విగ్రమానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. పూర్వ విద్యార్థులు దాదాపు 45 సంవత్సరాల తర్వాత కలుసుకోవడంతో వారు ఎంతో ఆనందంగా కన్పించారు. నాడు పాఠశాలలో గడిపిన మధుర స్మృతులను, గుర్తుకు తెచ్చుకుని సంతోషంగా గడిపారు. ఇక్కడ చదవిన విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించి దేశ, విదేశాల్లో అత్యున్నత స్థానాల్లో స్థిరపడ్డారు. నాడు తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు సుబ్రహ్మణ్యం, కగ్గల్లు అంజినప్ప, నారాయణ శెట్టిలను ఈసందర్భంగా వారు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా గురువులు మాట్లాడుతు 45 సంవత్సరాల తరువాత తమను పిలించి ఇంతటి తీపి జ్ఞాపకాలను తిరిగి ఆస్వాదించేలా చేయడం ఆనందంగా ఉందన్నారు. ప్రతి విద్యార్థి ఉన్నత స్థానంలో ఉండడం చాలా సంతోషంగా ఉందనారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతు ప్రతి సంవత్సరం డిసెంబర్ 25న అందరు కలిసే విధంగా నిర్ణయించుకున్నారు.

చేనేత పరిశ్రమ మనుగడకు పాటుపడాలి



అశ్వర్థనారాయణను సన్మానిసున్న నారాయణశెట్టి

ధర్మవరం టౌన్ : చేనేత పరిశ్రమ మనుగడకు పాటుపడాలని కర్నాటకకు చెందిన ఒబిసి కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు వీ.నారాయణశెట్టి ఆకాంక్షించారు. పట్టణంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం ఆయన కాంగ్రెస్ పార్టీ చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రంగన అశ్వర్థనారాయణకు శాలువా కప్పి ఘనంగా సత్కరించారు. నారాయణశెట్టి మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎంతో నమ్మకంతో రంగన అశ్వర్థనారాయణకు చేనేత విభాగం రాష్ట్ర అధ్యక్ష పదవిని అప్పగించిందన్నారు. కావున అశ్వర్థనారాయణ చేనేతల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేయాలని సూచించారు.

జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ముఖ్యంగా సత్యసాయి జిల్లాకేంద్రమైన పుట్టపర్తి ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని ఆయా మండలాల్లోని చర్చిలను ఈసందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు. క్రైస్తవ సోదరులు చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.

'ఇచ్చిన హామీలు నెరవేర్చండి'

14వ రోజూ కొనసాగిన అంగన్వాడీల సమ్మె
దీక్షా శిబిరాల్లో వివిధ రూపాల్లో నిరసన ప్రదర్శనలు

గాండ్లపెంట : శిబిరంలోనే క్రిస్మస్ కేక్ కట్ చేసి నిరసన తెలుపుతున్న అంగన్వాడీలు

హిందూపురం : సిఎం జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించాలని రోడ్డుపై ప్రార్థనలు చేస్తూ నిరసన

పెనుకొండ : పొర్లుదండాలు పెడుతూ

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి
సిఐటియు రాష్ట్ర కార్యదర్శి ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

అంగన్వాడీలకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సిఐటియు రాష్ట్ర కార్యదర్శి జి.ఓబులు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ పేర్కొన్నారు. డిమాండ్ చేశారు. సమ్మెలో భాగంగా 14వ రోజైన సోమవారం కూడా అంగన్వాడీలు దీక్షలను కొనసాగించారు. శిబిరాన్ని ఓబులు, వెంకటేష్ సందర్శించి వారికి సంఘీభావం తెలిపారు. వారు మాట్లాడుతూ అంగన్వాడీ కార్మికులకు ఉద్యోగ భద్రత, సమాన పనికి సమాన వేతనం, రూ. కనీస వేతనం 26,000, పిఎఫ్, ఈఎస్ఐ, గ్రాట్యుటీ, ఉద్యోగోన్నతులు, ఖాళీ పోస్టుల భర్తీ, తదితర డిమాండ్లను పరిష్కారించాలన్నారు. దీక్షలో సిఐటియు మండల అధ్యక్షులు కుళ్లాయప్ప, ప్రధాన కార్యదర్శి శ్రీరాములు, అంగన్వాడీ యూనియన్ లీడర్లు రంగమ్మ, ఆశీర్వాదమ్మ, వరలక్ష్మి, మణిమాల, కిష్టమ్మ, వరలక్ష్మి, పద్మావతమ్మ, లక్ష్మీదేవి, పద్మావతి, అశ్వనమ్మ, మినీ వర్కర్లు కమలమ్మ, శశికళ, కుమారి పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్లక్ష్యం తగదు : సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్

పుట్టపర్తి రూరల్ : అంగన్వాడీల సమస్యలను పరిష్కరించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం వహించడం తగదని సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ విమర్శించారు. స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ముందు అంగన్వాడీలు చేస్తున్న నిరసన దీక్షకు ఇంతియాజ్ సంఘీభావం తెలిపారు. ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా అంగన్వాడీలు పండగ పూట కూడా నిరసన దీక్షలు చేస్తున్నా సిఎం జగన్‌కు కనికరం లేదన్నారు. అంగన్వాడీల పట్ల ప్రభుత్వం తీసుకుంటున్న ఏకపక్ష నిర్ణయాలను పూర్తిగా వ్యతిరేకిస్తున్నామన్నారు. దీక్షలో సిఐటియు నాయకులు బ్యాళ్ళ అంజి, సిద్దు, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు సుజాత, నాగమణి, కోశాధికారి మంజుల, అంగన్వాడీలు పాల్గొన్నారు.

సిఎం జగన్ మనసు మారాలని అంగన్వాడీల ప్రార్థనలు

హిందూపురం : సిఎం జగన్ మనసు మారి తమ న్యాయమైన కోర్కెలు తీర్చే విధంగా ఆయనకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ అంగన్వాడీ మహిళలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అంగన్వాడీల 14వ రోజు సమ్మెలో భాగంగా క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని సిఐటియు జిల్లా అధ్యక్షులు జెడ్‌పి శ్రీనివాసులు, జిల్లా నాయకులు సాంబ శివ ఆధ్వర్యంలో సోమవారం పట్టణంలో అంగన్వాడీలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం సద్భవన్ సర్కిల్‌లో సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రికి మంచి బుద్దిని ప్రసాదించాలని కోరుతు సమ్మె శిబిరం ముందు కేక్ కట్ చేశారు. అదే విధంగా మండుటెండల్లో నడి రోడ్డుపై మోకాళ్లపై కుర్చోని ప్రార్థనలతో నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి రమణ, అంగన్ వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్టు కార్యదర్శి లావణ్య, యూనియన్ నాయకులు శైలజ, వరలక్ష్మి, శోభ, శిరీషా, నాగమ్మ, జ్యోతమ్మతో పాటు పెద్ద ఎత్తున అంగన్వాడీలు పాల్గొన్నారు.

చెవిలో పువ్వులతో..

ధర్మవరం టౌన్ : సమ్మెలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్వాడీలు సిఐటియు నాయకులతో కలిసి చెవిలో పువ్వులు పెట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరికి ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జెవి రమణ సంఘీభావం తెలిపారు. దీక్షలో సిఐటియు మండల అధ్యక్ష, కార్యదర్శులు ఆదినారాయణ, అయూబ్‌ఖాన్, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు జంగాలపల్లి పెద్దన్న, సిపిఎం పట్టణ కార్యదర్శి నాగార్జున, సిఐటియు నాయకులు బాలాజీ, షెక్షావలి, అంగన్వాడీలు పోతక్క, దీనా, మాంచాలినిదేవి, అనిత, క్రిష్ణవేణి, భువనేశ్వరి, లలిత పాల్గొన్నారు.

ఒంటి కాలిపై నిల్చొని నమస్కారం చేస్తూ..

నల్లచెరువు : అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు ఒంటి కాలిపై నిల్చొని నమస్కారం చేస్తూ నిరసన తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు మండల అధ్యక్షుడు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా కౌన్సిల్ సభ్యుడు శ్రీరాములు, వ్యవసాయ కార్మిక సంఘం కోశాధికారి రమేష్, అంగన్వాడీ యూనియన్ నాయకురాళ్లు సరస్వతి, పద్మావతి, కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

కదిరి అర్బన్ : క్రిస్మస్ సందర్భంగా దీక్షా శిబిరంలో అంగన్వాడీ, మినీ అంగన్వాడీ వర్కర్స్, ఆయాలు కేక్ కట్ చేశారు. వారు మాట్లాడుతూ సమ్మె పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరించడం న్యాయం కాదన్నారు. దీక్షలో అంగన్వాడీ యూనియన్ నాయకురాలు మాబున్నీసా, చంద్రకళ, లక్ష్మీదేవి, సుశీలరామ్, లక్ష్మమ్మ, శారద, సిఐటియు నాయకులు జిఎల్.నరసింహులు, జగన్మోహన్, బాబ్‌జాన్, నారాయణ, తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు ఏర్పాటు చేసిన శిబిరంలో అంగన్వాడీ సిబ్బంది దీక్షలను కొనసాగించారు. అంగన్వాడీల సమస్యలు పరిష్కరించేలా సిఎం జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని జీసస్‌ను ప్రార్థించారు. వీరికి సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. దీక్షలో నరసింహులు, ధనమ్మ, భాగ్యమ్మ, రూప, రత్నమ్మ మండలం లోని అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

గాండ్లపెంట : సమస్యల పరిష్కారం కోసం అంగన్వాడీలు చేపట్టిన దీక్షలు కొనసాగాయి. క్రిస్మస్ సందర్భంగా ముందుగా శిబిరంలో కేక్ కట్ చేశారు. మండల యూనియన్ అధ్యక్షురాలు లక్ష్మీదేవి, సుజాత, భారతి మాట్లాడుతూ ప్రభుత్వ తక్షణమే స్పందించి అంగన్వాడీల సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీక్షలో అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.

చిలమత్తూరు : సమ్మెలో భాగంగా అంగన్వాడీలు స్థానిక చర్చిలో వినూత్నరీతిలో ప్రార్థనలు చేసి నిరసన తెలిపారు. సిఎం జగన్‌కు మంచి బుద్ధిని ప్రసాదించి తమ న్యాయమైన కోర్కెలు తీర్చేలా ఆశీర్వదించాలని కోరారు. అనంతరం కేక్ కట్ చేశారు. దీక్షా శిబిరంలో వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగరాణి మాట్లాడుతూ 'అంగన్వాడీలు కోరింది గొంతెమ్మ కోర్కెలు కాదు'.. సిఎం జగన్ ప్రతిపక్షనేత హోదాలో ఇచ్చిన హామీలనే నెరవేర్చమని అడుగుతున్నారన్నారు. దీక్షలో వ్యకాసం జిల్లా అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, కార్యదర్శి పెద్దన్న, యుటిఎఫ్ ముండల కమిటీ సభ్యులు శ్రీనివాసులు, అంగన్వాడీ సిబ్బంది, సిఐటియు నాయకులు పాల్గొన్నారు.

పుట్టపర్తి అర్బన్ : అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని మంగళవారం కలెక్టరేట్ ముందు వామపక్ష పార్టీలు(సిపిఎం, సిపిఐ) ఆధ్వర్యంలో ధర్నాలు చేస్తున్నట్లు సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఈఎస్ వెంకటేష్ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. 13 రోజులుగా అంగన్వాడీలు రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం స్పందించకపోవడం అన్యాయమన్నారు. అంగన్వాడీలకు ప్రజా సంఘాలతో పాటు వామపక్ష పార్టీలు సంపూర్ణ మద్దతు తెలియజేస్తున్నాయన్నారు.

మద్దతుగా నేడు వామపక్షాల ధర్నా

శిబిరంలో క్రిస్మస్ కేక్ కట్ చేసి నిరసన

ముదిగుబ్బ : స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఆవరణలో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరంలో అంగన్వాడీలు క్రిస్మస్ కేక్ కట్ చేసి నిరసన వ్యక్తం చేశారు. వీరికి సిపిఎం, సిఐటియు నాయకులు మద్దతు తెలిపారు. దీక్షలో సిపిఎం మండల కార్యదర్శి ఆటో పెద్దన్న, సిపిఎం, సిఐటియు నాయకులు బాబు, వెంకటేష్, పోతలయ్య, లక్ష్మీనారాయణ, రహంతుల్లా, చాంద్ బాషా, అంగన్వాడి ప్రాజెక్టు అధ్యక్షురాలు రజియా, అంగన్వాడీ టీచర్ ఇందుమతి, హెల్పర్లు పాల్గొన్నారు.

మడకశిర : స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద అంగన్వాడీ సిబ్బంది దీక్షలను కొనసాగించారు. శిబిరాన్ని నియోజకవర్గ టిడిపి పరిశీలకులు పార్థసారథిరెడ్డి, టిడిపి ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు మంజునాథ్ సందర్శించి సంఘీభావం తెలిపారు.

బత్తలపల్లి : క్రిస్మస్ సందర్భంగా అంగన్వాడీలు స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందే కేక్ కట్ చేసి నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షలకు సిఐటియు జిల్లా శ్రామిక మహిళా కన్వీనర్ దిల్షాద్ మద్దతు తెలిపారు. దీక్షలో మండల అధ్యక్షురాలు వాసంతి, ప్రధాన కార్యదర్శి రజియా, సెక్టర్ లీడర్లు వసంత, రజిత, పుష్పలత, శివమ్మ, సుగుణ, క్రిష్టవేణి, జయసుధ, సున్నీబేగం, భాగ్యలక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

పొర్లు దండాలు పెట్టి

పెనుకొండ : నిరవధిక సమ్మెలో భాగంగా స్థానిక తహశీల్దార్ కార్యాలయం ముందు పొర్లు దండాలు పెట్టి నిరసన వ్యక్తం చేశారు. వీరి దీక్షా శిబిరాన్ని సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్ సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి వామపక్ష పార్టీల మద్దతుతో ఉద్యమం మరింత ఉధృతం చేస్తామన్నారు. దీక్షలో సిఐటియు మండల కార్యదర్శి బాబావలి, తిప్పన్న, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి గంగాధర్, వెంకటరాముడు, ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు బావమ్మ, జయమ్మ, సెక్టార్ లీడర్లు మాబున్నీసా, వరలక్ష్మి, శాను, రాజేశ్వరి, వెంకటరత్నం, అనిత, లక్ష్మి, అనూష పాల్గొన్నారు.

గుడిబండ : ప్రాజెక్ట్ కార్యదర్శి మహదేవమ్మ ఆధ్వర్యంలో అంగన్వాడీలు సమ్మెను యథావిధిగా కొనసాగించారు. కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.

తలుపుల : స్థానిక ఎంపిడిఒ కార్యాలయం ఎదుట అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో చేపట్టిన సమ్మె కొనసాగింది. తమ సమస్యలు పరిష్కరించేత వరకు సమ్మె కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

కదిరి : దీక్షలో పాల్గొన్న అంగన్వాడీలు

ధర్మవరం : చెవిలో పువ్వు పెట్టుకుని నిరసన

నల్లచెరువు : ఒంటికాలిపై నిల్చొని నమస్కారం చేస్తూ..

చిలమత్తూరు : మాట్లాడుతున్న వ్య.కా.సం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు నాగరాణి

తలుపుల : ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న అంగన్వాడీలు

మున్సిపల్ వర్కర్స్ బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-కదిరి అర్బన్

మున్సిపల్ కార్మికుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులు స్థానిక ఆర్అండ్‌బి బంగ్లా నుంచి అంబేద్కర్, ఇందిరాగాంధీ, జీవమాను సర్కిల్, ఇక్బాల్ రోడ్డు, హిందూపూర్ క్రాసింగ్ మీదుగా మున్సిపల్ కార్యాలయం వరకూ బైక్ ర్యాలీ నిర్వహించారు. వారు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ. 26,000, పనిముట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలు పరిష్కరించాలన్నారు. ర్యాలీలో మున్సిపల్ కార్మిక సంఘం నాయకులు జనార్ధన, తిరుపాలు, బాలకృష్ణ, చెన్నకృష్ణ, రాజు, సూర్యచంద్రప్ప, రామాంజులు, సిఐటియు నాయకులు జగన్మోహన్, వాజిల్ నారాయణ, వైరోజ్ తదితరులు పాల్గొన్నారు.

క్రిస్టియన్ల ద్రోహి సిఎం జగన్

ప్రజాశక్తి-పెనుకొండ

సమావేశంలో మాట్లాడుతున్న సవితమ్మ

టిడిపి అధికారంలో ఉంటే నేడు పేద క్రైస్తవులకు 'చంద్రన్న క్రిస్మస్ కానుక' అందేదని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి సవితమ్మ పేర్కొన్నారు. పట్టణంలోని తన కార్యాలయంలో సోమవారం ఆమె మాట్లాడుతూ టిడిపి పాలనలో చంద్రబాబు క్రిస్మస్ కానుక, జెరుసలేం వెళ్లే క్రిస్టియన్లనకు రూ. 50 వేలు ఇచ్చేవారని, క్రిస్టియన్ ద్రోహి జగన్ అవన్నీ రద్దు చేసి క్రిస్టియన్ల పొట్ట కొట్టాడని తెలిపారు. సమావేశంలో సీనియర్ నాయకులు మాధవనాయుడు, వెంకటరమణ, శ్రీరాములు, సూర్యనారాయణ, సోమశేఖర్, నరసింహులు, సుబ్రహ్మణ్యం, త్రివేంద్రనాయుడు, కొండారెడ్డి, బాబుల్ రెడ్డి, మంజునాథ్, చిన్నపోతన్న, వాసుదేవ రెడ్డి, అంజనప్ప, గుట్టూరు శ్రీనివాసులు, శ్రీకాంత్, సానిపల్లి వెంకటేష్, గోవిందప్ప, సానిపల్లి ఆవుల అంజనప్ప, వెంకటేష్, మద్దిలేటి, రమేష్ పాల్గొన్నారు.

రాజ్యాధికారంతోనే బిసిల అభివృద్ధి

సమావేశంలో మాట్లాడుతున్న బిసి సంఘం నాయకులు

కొత్తచెరువు : రాజ్యాధికారంతోనే బిసిల అభివృద్ధి సాధ్యమవుతుందని బిసి ఐక్యవేదిక జిల్లా అధ్యక్షులు కొట్టాల శ్రీరాములు, గౌరవాధ్యక్షులు సామకోటి ఆదినారాయణ తెలిపారు. కొత్తచెరువులో సోమవారం సాయంకాలం బిసి ఐక్యవేదిక ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో బిసి కమిటీలను వేసి జనవరి మొదటి వారంలో పుట్టపర్తిలో భారీ బహిరంగ సభ నిర్వహిస్తామని, బిసిలు పెద్దఎత్తున హాజరై జయప్రదం చేయాలని కోరారు. రాబోయే ఎన్నికల్లో అన్ని రాజకీయ పార్టీలు జనాభా ప్రాతిపదికన బిసిలకు ఎమ్మెల్యే, ఎంపి టికెట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. బిసిలకు గుర్తింపు ఇచ్చే పార్టీలతోకే మద్దతు ఇస్తామన్నారు. సమావేశంలో బిసి ఐక్యవేదిక జిల్లా అధికార ప్రతినిధి లోచర్ల పెద్దన్న, నాయకులు డిపో భాస్కర్, తలమర్ల ప్రభాకర్, బండ్లపల్లి పెద్దన్న, శివకృష్ణ, మహేష్, రవిచంద్ర, తదితరులు పాల్గొన్నారు

వైభవంగా అయ్యప్పస్వామి రథోత్సవం

అయ్యప్ప స్వామి రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండల కేంద్రానికి సమీపంలోని ఎం.కొత్తపల్లి బంగారు బండపై వెలసిన శ్రీధర్మశాస్త అయ్యప్ప స్వామి దేవస్థానంలో సోమవారం 11వ వార్షికోత్సవ రథోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. పుట్టపర్తి ఆర్డీఓ భాగ్యరేఖ స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. ముందుగా ఆలయ నిర్మాణ సంకల్పకులు పచ్చార్ల ఆంజనేయులు నాయుడు ఆలయంలో వినాయకుడు, సుబ్రహ్మణ్యంస్వామి, మణికంఠ స్వామిలకు అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వివిధ రకాల పుష్పాలతో అలంకరించిన రథంలో అయ్యప్పస్వామి పంచలోహ విగ్రహాన్ని కొలువుదీర్చి వడ్డివారిపల్లి, వైఎస్ఆర్ సర్కిల్, మీసేవా కేంద్రం, అంబేద్కర్ సర్కిల్, బస్టాండ్ మీదుగా పోలీస్‌స్టేషన్ వరకూ భక్తుల అయ్యప్ప నామస్మరణ మధ్య ఊరేగించారు. అనంతరం అన్నప్రసాద కార్యక్రమంలో 3వేల మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు బి.మల్లికార్జునరెడ్డి, కిషోర్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

లహరిని సన్మానిస్తున్న గాండ్ల సంఘం నాయకులు

ఎస్ఐగా ఎంపికైన లహరికి సన్మానం

ముదిగుబ్బ : మధ్యతరగతి కుటుంబంలో జన్మించి అకుంఠిత దీక్షతో మొదటి ప్రయత్నంలోనే పోలీ స్ ఎస్ఐగా ఎంపికైన లహరి ఎందరికో స్ఫూర్తి అని జిల్లా గాండ్ల సంఘం నాయకులు పేర్కొన్నారు. సంఘం ఆధ్వర్యంలో లహరిని ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ లహరి లక్ష్య సాధనకు సహకరించిన తల్లిదండ్రులు గురు ప్రసాద్, నాగరత్నమ్మ అభినందనీయులు అన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు చింతకుంట రామయ్య, లక్ష్మీనరసయ్య, పార్నపల్లి రవి, రామాంజనేయులు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గొబ్బరంపల్లిలో ఇళ్ల మధ్య మురుగు

రొద్దం మండం గొబ్బరంపల్లి గ్రామంలో ఇళ్ల మధ్యలో నిలిచిన మురుగునీరు

రాష్ట్ర స్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కదిరి టౌన్

మెడల్స్, ప్రశంసా పత్రాలతో విద్యార్థులు

చిత్తూరు జిల్లాలో ఆదివారం జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో జిల్లా విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు మాస్టర్ షాకీర్ తెలిపారు. 16 జిల్లాల నుంచి 300 మంది పాల్గొనగా జిల్లా నుంచి 10 మంది విద్యార్థులు లోబ, ఖవానకీ విభాగాల్లో ప్రతిభ చాటి 7 బంగారు, 2 సిల్వర్, 1 బ్రాంజ్ పతకాలు సాధించారు. బాలికల విభాగంలో రీదాముస్కాన్, రోషిని, చాందిని బంగారు పతకాలు సాధించారు. బాలుర విభాగంలో మహమ్మద్ కైఫ్, లవన్ కుమార్, మహమ్మద్ జావెద్, ఓపెన్ క్యాటగిరీలో మహమ్మద్ కైఫ్ బంగారు, రిహాన్ సిల్వర్, రబ్బన్ బ్రాంజ్, మాస్టర్ షాకీర్ సిల్వర్ పతకాలు సాధించారు. రాష్ట్ర స్థాయిలో బంగారు పతకం సాధించిన విద్యార్థులు జనవరి 4 నుంచి 6 వరకూ రాజస్థాన్‌లో జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారు.

29న విగ్రహాల ప్రతిష్టాపన

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

పట్టణంలోని చెలిమి వద్ద సీతారామాంజనేయ స్వామి ఆలయ చెలిమి జీర్ణోద్ధరణ సంఘం ఆధ్వర్యంలో సీతారామ లక్ష్మణ పంచముఖ ఆంజనేయస్వామి, ద్వాదశ జ్యోతిర్లింగ ప్రతిష్ట మహోత్సవాలు సోమవారం అత్యంత వైభవంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 29వ తేదీ భక్తుల సమక్షంలో విగ్రహ ప్రతిష్టాపన కార్యక్రమాలు నిర్వహిస్తారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు గడ్డం పార్థసారథి, పళ్ళెం వేణుగోపాల్, అధ్యక్షులు బండారు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు డిఎం.సుందరేశన్, కార్యదర్శి పామయ్యగారి లక్ష్మీనాథ్, జాయింట్ కార్యదర్శి కోటం హేమంత్‌కుమార్, కోశాధికారి ఊడుగుండ్ల వెంకట నరసింహులు, ప్రధాన అర్చకులు మోహనస్వామి పాల్గొన్నారు.

'కూచిపూడి' కళావైభవంలో ధర్మవరం కళాకారులు

ప్రజాశక్తి-ధర్మవరం టౌన్

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి స్టేడియంలో ఆదివారం నిర్వహించిన కూచిపూడి నృత్య కళా వైభవం కార్యక్రమంలో ధర్మవరం పట్టణానికి చెందిన శ్రీలలిత నాట్య కళానికేతన్ నాట్యాచార్యులు బాబు బాలాజీ శిష్యులు 12 మంది పాల్గొన్నారు. వారిలో రామలాలిత్య, సర్వశ్రీ, వేద, ప్రజ్ఞ, తనులత, ఉమాప్రియ, వైష్ణవి, అదిత్రి, జాహ్నవి, లీలామాధవి, ఉదయశ్రీ, సహస్ర ఉన్నారు. బాబు బాలాజీ మాట్లాడుతూ ఒకే సారి 3,782 మంది కళాకారులు 7 నిమిషాల పాటు లయబద్ధంగా కూచిపూడి నృత్యాన్ని ప్రదర్శించి గిన్నిస్ బుక్కులో చోటు సంపాదించడం హర్షణీయమన్నారు.

ఆకట్టుకున్న 'మానస' శిష్యులు

ధర్మవరంలోని మానస నృత్య కళాకేంద్రం వారి శిష్య బృందం ప్రదర్శించిన కూచిపూడి నృత్య వైభవం ఆకట్టుకుంది. వేడుకల్లో గురువు మానసతో పాటు శిష్య బృందం సోమశేఖర్, జాహ్నవి, యశస్విని, హేమశ్రీ పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

కొత్తచెరువు : స్థానిక వాసవీ కళ్యాణ మండపంలో బెంగళూరుకు చెందిన శంకర కంటి ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 350 మందికి డాక్టర్లు వైద్య పరీక్షలు చేసి 170ని ఆపరేషన్లకు ఎంపిక చేసి బస్సులో బెంగళూరుకు తరలించారు. శిబిరానికి వచ్చిన వారికి మెడికల్ స్టోర్ సుబ్రహ్మణ్యం భోజనం ఏర్పాటు చేశారు.

కళ్యాణ మండపం నిర్మాణానికి విరాళం

మడకశిర : రొళ్ల మండలం కాల్వేపల్లి గ్రామంలో శ్రీలక్ష్మీరంగనాథస్వామి ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న కళ్యాణ మండపానికి సోమవారం బెంగళూరులోని కల్లిహల్లి గ్రామానికి చెందిన సురేష్ కుటుంబ సభ్యులు రూ. 25 వేలు అందజేశారు. కార్యక్రమంలో అర్చకులు, కమిటీ నిర్వాహకులు రాజన్న, శ్రీరంగప్ప, కాంతరాజు, తిమ్మప్ప, నారాయణప్ప, బండి రమేష్ పాల్గొన్నారు.

అంబేద్కర్ కాల పట్టిక ఆవిష్కరణ

కదిరి అర్బన్ : పట్టణంలో సోమవారం ఎస్కేయూ పాలక మండలి సభ్యులు కొమ్ము విజయభాస్కర్ ఆధ్వర్యంలో అంబేద్కర్ చిత్రపటంతో ముద్రించిన కాల పట్టికను ముఖ్యఅతిథులు ఎపిపిఎస్‌సి సభ్యులు సుధాకర్‌రెడ్డి, ఎస్కేయూ రిజిస్ట్రార్ లక్ష్మయ్య ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ భవిష్యత్తులో ప్రతి ఒక్కరూ ఉన్నత స్థాయికి ఎదిగి సమాజసేవకు ఉపయోగపడేలా ఆలోచించి కొన్ని దశాబ్దాల క్రితమే రాజ్యాంగం రచించిన మహనీయుడు డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అని కొనియాడారు.

'కందికుంట' ఆర్థిక సాయం

తనకల్లు : ఇటీవల మండల పరిధిలోని రెడ్డివారిపల్లి గ్రామంలో కుక్కలు దాడి చేయడంతో మస్తానప్పకు చెందిన 13 గొర్రెలు మృతి చెందాయి. విషయం తెలిసిన వెంటనే మాజీ ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ రూ. 20వేలు ఇవ్వడంతో ఆ నగదును సోమవారం టిడిపి సీనియర్ నాయకులు దేశాయ్ జయచంద్రారెడ్డి, దేశాయ్ హరినాథరెడ్డి, కుంచే నాగేంద్రప్రసాద్ మస్తానప్పకు అందజేశారు. కార్యక్రమంలో వేమనారాయణ, మునెప్ప, రామప్ప, ఎన్.వెంకటరమణ, నల్లప్ప, రవణప్ప, శ్రీనివాసులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న టిడిపి నాయకులు

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఏసుక్రీస్తు జయంతి సందర్భంగా సోమవారం ప్రశాంతి నిలయంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. సాయి కుల్వంత్ హాలులో సత్యసాయి మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జె రత్నాకర్, సభ్యుడు చక్రవర్తి వేడుకలను ప్రారంభించారు. బాబా సమాధి చెంత దేశ విదేశీ భక్తులు భక్తి గీతాలు ఆలపించారు. ప్రశాంతి నిలయంలో గణేష్ గేట్ ఎదురుగా ఉన్న 35 అడుగుల చెట్టును విద్యుత్ దీపాలతో అలంకరించి గణేష్ భజన చేశారు. స్పెయిన్, చెక్ రిపబ్లిక్ దేశభక్తులు పాల్గొన్నారు. సాయంత్రం సాయి కుల్వంత్ హాలులో చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.

పుట్టపర్తి క్రైమ్ : క్రిస్మస్ సందర్భంగా మండల పరిధిలోని ఎనుములపల్లి సియోను మినిస్ట్రీస్ చర్చిలో పాస్టర్ జోసెఫ్ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మున్సిపాలిటీ పరిధిలోని కర్నాటక నాగేపల్లి చర్చిలో పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి మత బోధనలు చేశారు. క్రైస్తవులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. కొత్తచెరువు బేతేలు చర్చిలో పాస్టర్ జోసెఫ్ క్రిస్మస్ పర్వదిన విశిష్టతను భక్తులకు వివరించారు. చిన్నారులు క్రీస్తు పాటలకు చేసిన నృత్యాలు చూపరులను ఆకట్టుకున్నాయి.

కదిరి టౌన్ : పట్టణంలోని సిఅండ్ఐ ఇమ్మానుయేల్ తెలుగు చర్చి, సియోన్ బ్లెస్సింగ్ మినిస్ట్రీస్ చర్చిల్లో సోమవారం నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి పాల్గొని ప్రార్థనలు చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ జీసస్ మానవాళికి ప్రేమ, కరుణ, సహనం, దాతృత్వం వివరించారన్నారు. క్రీస్తు మార్గం ఆచరణీయం, వారి అడుగుజాడల్లో నడవాలన్నారు. ఆయన వెంట వైసిపి నాయకులు సాయిప్రణీత్‌రెడ్డి, సాధిక్‌వలి, తదితరులు ఉన్నారు.

కదిరి అర్బన్ : ఆమిన్ నగర్ పత్మాస్ ప్రార్థనా మందిరంలో పాస్టర్ జాషువా జాబేజ్ ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. హైదరాబాద్ నుంచి వచ్చిన హెరాల్డ్ ప్రత్యేక సందేశం ఇచ్చారు. అనంతరం క్రీస్తు యేసు రక్షణ సువార్తను పట్టణ వీధుల్లో ప్రకటించారు.

ధర్మవరం టౌన్ : టిడిపి ఆధ్వర్యంలో పట్టణంలోని పలు వార్డుల్లో ఉన్న చర్చిల్లో కేక్ కట్ చేసి క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక లక్ష్మీచెన్నకేశవపురంలోని చర్చిలో 25వ వార్డు ఇన్‌ఛార్జి భీమనేని ప్రసాద్‌నాయుడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు ఫణికుమార్, పురుషోత్తంగౌడ్, చీమల రామాంజి, టైలర్ గోపాల్, క్లస్టర్ రామాంజి, హోటల్ సూరి, జయరాముడు, జనార్ధన్, ఉపేంద్రనాయుడు, పూజారి పోతలయ్య, కేతినేని రాజ, బొట్టు కిష్ట, పూల కుంట్ల మహేశ్, తోట నారాయణస్వామి, కేశగాళ్ల శీన, బీరే శ్రీనివాసులు, బిల్లే శీన, అశోక్, పాల్గొన్నారు.

కొత్తచెరువు : మండల వ్యాప్తంగా క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక దర్గా వీధి, ఎస్సీ కాలనీ, నెహ్రూనగర్, పెనుకొండ రోడ్డు, నల్లగొండ, మైలేపల్లి చర్చిలను రంగురంగుల విద్యుత్ దీపాలు, నక్షత్రాలతో అలంకరించి క్రిస్మస్ ట్రీలు ఏర్పాటు చేశారు. జీసస్ జన్మదిన వృత్తాంతం తెలిపే బొమ్మలను ఆకట్టుకునేలి ఏర్పాటు చేశారు. పాస్టర్లు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కేక్ కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. హాజరైన వారికి భోజనం, స్వీట్లు పంపిణీ చేశారు.

గాండ్లపెంట : గాండ్లపెంటతో పాటు మండల పరిధిలోని చాలా గ్రామాల్లో క్రైస్తవులు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. మండల కేంద్రంలోని చర్చిలో పాస్టర్ శ్యామల ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చి ప్రజలు క్యాండిల్స్ వెలిగించి ప్రార్థనలు చేశారు.

ముదిగుబ్బ : క్రైస్తవులందరూ ఆనందంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకోవాలనే ఉద్దేశంతో మండల పరిధిలోని అన్ని చర్చిలకు ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అందజేసిన కేకులను స్థానిక నాయకులు అందజేశారు. ఆయా చర్చిల్లో కేక్ కట్ చేసి వేడుకలను ఘనంగా నిర్వహించారు.

గుడిబండ : గుడిబండలో సోమవారం క్రిస్టియన్లు ఘనంగా క్రిస్మస్ వేడుకలు జరుపుకున్నారు. ఉదయాన్నే ప్రార్థన మందిరానికి వెళ్లి ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు.

కదిరి : క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న ఎమ్మెల్యే పివి సిద్ధారెడ్డి

లక్ష్మీచెన్నకేశవపురం చర్చిలో కేక్ కట్ చేస్తున్న ఫాస్టర్, టీడీపీనాయకులు